# తీర్పు

అప్పటికే సాయంత్రం అవడంతో, సంధ్య చీకట్లు మెల్ల మెల్లగా అలుముకుంటున్నాయి ఇల్లంతా చీకటి ఆవరించినా లైటు వెయ్యాలన్న ధ్యాస కూడా లేకుండా ఏదో ఆలోచనలో మునిగిపోయింది లక్ష్మి.

అసలు ఆ ఉత్తరాన్ని చదివిన దగ్గర నుండి, ఆమె మనసు మనసులో లేదు అది భర్త పేరమీద వచ్చిన ఉత్తరమే అయినా, తను విప్పి చదివింది తమ మధ్య అరమరికలు లేవని

ఆయన తన దగ్గర ఏ విషయాలూ దాచరను కుంది కానీ . కానీ. . తను ఆయన్ని పరిపూర్ణంగా అర్థం చేసుకో లేకపోయింది ఆయనకి ఇద్దరు కొడుకులు, ఒక కూతురు ఉన్నారన్న సంగతి ఈ ఉత్తరం చదివే వరకు తనకు తెలియదు

ఆయన తన మనసులో అగ్నిగుండాన్ని దాచుకుని, తనతో చిరునవ్వుతో సహ జీవనం చేస్తున్నారని ఇన్నాళ్ళు ఊహించ లేకపోయింది

తమకి పెళ్ళి ఆరు నెలలు గడిచినా, ఒక్కనాడు ఆయన తన పిల్లల గురించి చెప్పలేదు. పిల్లల సంగతి తనతో చెప్తే, తను వాళ్ళని ఈ ఇంటికి రావద్దంటుందనుకున్నారా! లేకపోతే పిల్లలు తన మీద అసహ్యాన్ని పెంచుకుంటారని ఈ విషయాన్ని దాచారో తెలియదు

ఈ రోజు ఏమైనాసరే తను నిజం రాబట్టాలి ఆయన నోటి ద్వారా ఆయనే తనకీ సంగతి చెప్పాలి.

ఆలోచిస్తున్న లక్ష్మి తలుపు తోసిన శబ్దం అవడంతో ఉలిక్కిపడింది

అప్పటికే గదిలోకి అడుగు పెట్టిన విష్ణుమూర్తి, చీకటిలో కూర్చున్న భార్యను చూసి" లక్ష్మీ! ఇదేమిటి లైటన్నా వెయ్యకుండా చీకటిలో కూర్చున్నావు" అన్నాడు షర్టు విప్పుతూ.

"అబ్బే! ఏంలేదు 'మరచిపోయాను' అంది తడబాటుగా

లైటు వేసి భార్య ముఖంలోకి పరిశీలనగా చూసాడు విష్ణుమూర్తి తెల్లగా పాలిపోయి నట్లున్న ముఖం, ఎప్పుడూ జ్యోతుల్లా ఉన్న కళ్ళు, ఆమె ఏదో వేదనని అనుభవిస్తోందని చెప్పక చెప్తున్నాయి

"లక్ష్మీ! ఒంట్లో బాగులేదా! అసలేమైంది? ఈ రోజు ఇంత నీరసంగా ఉన్నావేంటి?" ఆత్రంగా అడిగాడు విష్ణుమూర్తి

'సుకన్య ఉత్తరం వ్రాసింది" అంది పొడిగా

"సుకన్యా!" ఆశ్చర్యంగా అడిగాడు.

"ఔను. సుకన్య ఎవరండీ!" తెలియనిట్టు అడిగింది.

'ఎవరైతే నీకెందుకులే! ఆ ఉత్తరం ఇటివ్వు" అన్నాడు కంగారుగా

'నాకెందుకేమిటండీ సుకన్య ఎవరో మీరు ఈవేళ చెప్పకపోయినా రేపైనా తెలుస్తుందిగా' సుకన్య రేపే ఈ ఊరు వస్తున్నట్టు ఉత్తరం వ్రాసింది.

"ఆ ఉత్తరం నువ్వు చదివావా!"

"క్షమించండి. ఆ ఉత్తరాన్ని చదవకూడదనుకునే చదివేను ఎందుకండీ నా దగ్గర ఈ నిజాన్ని దాచారు సుకన్య మీ బిడ్డ అని చెప్తే నేను తనని ఈ ఇంటికి రానివ్వననుకున్నారా! మీరు నాకు ప్రసాదించిన ఈ సౌభాగ్యానికి, నేను జన్మ జన్మలకు ఋణపడి ఉంటాను. అటువంటిది మిమ్మల్ని, మీ పిల్లల్ని ద్వేషిస్తానని ఎలా అనుకున్నారు?" ఆమె కంఠంలో సన్నని బాధ.

"లక్ష్మి! బాధపడుతున్నావా నాకు పిల్లలున్నారన్న సంగతి నేనేనాడో మరచిపోయాను. వాళ్ళు నాకు బిడ్డలు కారు నా పాలిట శత్రువులు వాళ్ళు చేసిన అవమానాలు, నిరాదరణ తలచుకుంటే, మనసు ముక్కలైపోతుంది నా పిల్లలు ఏం ఉద్ధరిస్తున్నా రని నీతో గర్వంగా చెప్పుకోవాలి? అందుకే. అందుకే వాళ్ళ గురించి నీకు చెప్పలేదు. నను మన్నించు" అన్నాడు విష్ణుమూర్తి

"వద్దండీ! అంత మాట అనకండి" అంది లక్ష్మి చప్పున

లక్ష్మీ! సుకన్య ఏం వ్రాసింది.

"ఇదుగో ఉత్తరం. మీరే చదువుకోండి అని ఉత్తరాన్ని అందించింది.

ఆ ఉత్తరాన్ని అందుకొని చదవసాగాడు విష్ణుమూర్తి

పూజ్యులైన నాన్న గారికి నమస్కారములు

నాకన్నా వయసులో పెద్దవారు, నన్ను కన్న తండ్రి కాబట్టి, మీకు నమస్కారం పెట్టే సంస్కారం నాలో ఇంకాపోలేదు.

మీరు చేసిన వెధవ పనికి, నేను చాలా సిగ్గుపడుతున్నాను. నాకు పెళ్ళిచేసి అత్తవారింటికి పంపేశారు అన్నయ్యలిద్దరూ మంచి ఉద్యోగాల్లో ఉన్నారు. వాళ్ళకి కూడా పెళ్ళిళ్ళు చేసేసి, మీ చెయ్యి దులిపేసుకున్నారు అటువంటిది ఈ వయసులో మీకు పెళ్ళి కావలసి వచ్చిందా! ఛీ! ఛీ! నాకు మీ ముఖం చూడాలంటేనే అసహ్యం వేస్తుంది. కాటికి కాళ్ళు చాపుకు కూర్చున్న ఈ వయసులో, ఒక ఆడపిల్లకి అన్యాయం చెయ్యాలని మీకెలా అనిపించింది?

అసలు మీరు పెళ్ళి చేసుకున్నట్టు మామయ్య గారు ఉత్తరం వ్రాసేంత వరకు నాకు ఈ విషయం తెలియలేదు.

ఉన్న ఊళ్లో కళ్ళ ఎదుట ఉంటానని, మీ ఊళ్లో సంబంధమే చేసారు. కానీ ఆయనకి ట్రాన్సఫర్ కావడంతో, నేను ఆ ఊరు వదలిపెట్టవలసి వచ్చింది. అసలు నేను ఆ ఊర్లో ఉంటే, మీచేత అంత ఘోరమయిన తప్పు పని చెయ్యనిచ్చే దాన్ని కాదు

నేను పండక్కి మీ ఊరు వస్తున్నాను కానీ మీ ఇంటికి మాత్రం రాను నేను అక్కడికి వచ్చినట్టు మీకు తెలిసినా, మీరు మా అత్తవారింటికి రావద్దు ఇక మీదట మీరు నన్ను చూడాలని ఆరాటపడ్డా, కన్న మమకారాన్ని త్రెంచుకోలేక నాదగ్గరకు రావడానికి ప్రయత్నించినా, మీ అల్లుడుగారు ఒప్పుకోరు ఇప్పటికే మీరు చేసిన పనివల్ల, నా అత్త వారింట్లోనూ, భర్త దగ్గర చులకన అయ్యాను ఇక నేను మీకు కూతురిని కాను నాకు మీరు తండ్రి కాదు ఇక జీవితంలో మీ ముఖం చూడను. ఇదే మీకు నేను వ్రాస్తున్న ఆఖరి ఉత్తరం.

ఇట్లు
సుకన్య

ఉత్తరాన్ని చదివి దీర్ఘంగా నిట్టూర్చాడు విష్ణుమూర్తి

అప్పటికే సజల నయనాలతో తనని చూస్తున్న లక్ష్మిని చూసి "లక్ష్మీ! సుకన్య ఏం వ్రాసిందో చూసావా!" అన్నాడు బాధగా

"ఔనండీ! ఇదంతా నావల్లే జరిగింది. నావల్ల మీరు అప్రదిష్టపాలయ్యారు. నాలాంటి దురదృష్ట వంతురాలు ఈ ప్రపంచంలో బ్రతకకూడదు". అంది లక్ష్మి కన్నీళ్లను తుడుచుకుంటూ.

"లక్ష్మీ! వద్దు నువ్వు నాకు దూరంగా వెళ్ళిపోవద్దు. ఈ చివరి దశలో లభించిన నీ సాహచర్యాన్ని నాకు దూరం చెయ్యొద్దు" అర్థిస్తున్నట్టు అన్నాడు

"నా మూలంగా మీ పిల్లలు మీకు దూరం అయ్యారు. కన్న బిడ్డల చేత ఛీ! అనిపించుకోవడం కన్నా, దుర్భరమైనది మరొకటి ఉండదు. నన్ను పెళ్ళి చేసుకోబట్టే, ఆఖరికి మీ పిల్లలు కూడా మీకు దూరం అయ్యారు". అంది గద్గద స్వరంతో.

"లేదు లక్ష్మీ! వాళ్ళు నన్ను దూరం చేసుకోబట్టే, నేను నీకు దగ్గరయ్యాను. వాళ్ళు చిన్న పిల్లలు.

ఆవేశం తప్ప, ఆలోచన ఉండదు. వాళ్ళు ఎప్పటికైనా నేను చేసిన పనిని సమర్థించకపోరు. నువ్వు అదేం మనసులో పెట్టుకోవద్దు. నాకు అలసటగా వుంది కాస్త కాఫీ తీసుకురా!" అన్నాడు.

"అలాగే" అంటూ అక్కడ నుండి కదిలింది లక్ష్మి.

★ ★ ★ ★ ★

సుకన్య, శ్రీధర్, ఆ ఊరు వచ్చి రెండు రోజు లయింది సుకన్య మనసంతా చికాకుగా వుంది. ఆమె ఎక్కడికి బయలుదేరి వెళ్ళినా "సుకన్యా! మీ నాన్న మళ్ళీ పెళ్ళి చేసుకున్నాడట! ఈ వయసులో ఆయనకి పెళ్ళేమిటి? ముసలోడికి దసరాపండుగ అన్నట్టుంది" అన్న అమ్మలక్కల మాటలు, ఆమె హృదయాన్ని ఱంపపు కోత కోసేవి

పోనీ ఎక్కడికి వెళ్ళకుండా ఇంటి దగ్గర 'కూర్చుందామంటే, ఇంట్లో అత్తగారి సాధింపులు అలాగే వుండేవి

'సుకన్యా! ఈ వయసులో మీ నాన్నకిదేం బుద్ధి? ఇలాంటి వెధవ వేషాలు వెయ్యబట్టే, మీ అన్నయ్యలు ఆయన్ని ఇంట్లోంచి తగలేసి ఉంటారు. జవసత్వా లుడిగిపోయిన ఈ వయసులో మీ నాన్నకి పెళ్ళి కావలసి వచ్చిందా! ఆ అమ్మాయి పాపం నీళ్ళు కూడా పోసుకుందట! అంటే నీకు త్వరలో తమ్ముడో, చెల్లెలో పుడతారన్నమాట!" అంది

"సుకన్యా! మొత్తం మీద మీ నాన్న మంచి. గ్రంథసాంగుడే నన్నమాట!" అన్న భర్త హేళన ఆమెనెంతో వేదనకి గురిచేసేది

అందుకే ఇంక అక్కడ ఉండలేక, తమ ఊరికి వెళ్ళిపోదామంది సుకన్య

"ఈ రెండు రోజులు ఎలాగో ఓపిక పట్టు పండగ వెళ్ళిపోగానే మనం వెళ్ళిపోదాం' అన్న భర్త మాటకు మరి జవాబు చెప్పలేక మౌనంగా ఊరుకుండి పోయింది

'అసలు తండ్రి ఎందుకిలా చేసాడు?' అన్న ప్రశ్న ఆమెను అనుక్షణం వేధిస్తోంది

అప్పుడు ఆమెకు గుర్తు వచ్చారు రంగనాథం

ఔను రంగనాథం, నాన్న చిన్నప్పటి నుండి స్నేహితులు వాళ్ళిద్దరి మధ్య అరమరికలు లేవు. ఇంతవరకు ఒకరికి తెలియకుండా, మరొకరు ఏ పనీ చెయ్యలేదు తను రంగనాథం బాబాయ్ దగ్గరికి వెళ్తే అన్ని విషయాలు తెలుస్తాయి ఆలోచిస్తూ అన్యమనస్కంగా గడిపిందా రోజంతా!

★ ★ ★ ★ ★

ఆ రోజు పనిగట్టుకుని రంగనాథం ఇంటికి బయలుదేరింది సుకన్య

సుకన్యను చూస్తూనే ఏమ్మా! సుకన్యా! రా! రా! చాన్నాళ్ళకి వచ్చావు". అన్నాడు రంగనాథం

"పిన్ని ఇంట్లో లేదా! తమ్ముడు, చెల్లి ఎక్కడికి వెళ్ళారు అంది సుకన్య.

"మీ పిన్నికి ఎప్పుడూ ఉండేదేగా దైవభక్తి ఈ రోజు శివ కోవెలకి వెళ్ళింది. నాగార్జున, విజయ కాలేజీకి వెళ్ళిపోయారు ఈ ఇంట్లో తీరుబడిగా నేనే కూర్చున్నాను" అన్నాడు రంగనాథం.

అయ్యో! నేను వచ్చేసరికి ఎవ్వరూ లేరన్నమాట! అంది నిట్టూరుస్తూ!

"సుకన్యా! మీ నాన్న బాగున్నాడా! వాడిని చూసి చాన్నాళ్ళయ్యింది. ఈ మధ్య నాకు సుస్తీ చేసింది. నెల రోజులబట్టి, ఇల్లు దాటి బయటకు వెళ్ళలేదు" అన్నాడు

"ఆయనకేం బాగానే ఉంటారు. ఆయన చేసిన పనికి మధ్యన మేమేగా తల వంచుకోవాలి" అంది సుకన్య విసురుగా.

'తల దించుకోవలసినంత తప్పు పని వాడేం చేసాడమ్మా!" విస్మయంగా అడిగాడు.

'బాబాయ్‌గారూ! ఈ విషయం మీకింకా తెలియలేదా! నాన్న.. నాన్న. మళ్ళీ పెళ్ళి చేసుకున్నారు' అంది వణికే గొంతుతో

'ఓష్! అదా! ఆ సంగతి నాకు తెలియక పోవడమేమిటి? నేనే కదా దగ్గరుండి వాళ్ళ పెళ్ళి జరిపించాను". అన్నాడు రంగనాథం తేలిగ్గా!

"సుకన్యా! నేను చెప్పేది వింటున్నావా!" మళ్ళీ అన్నాడు రంగనాథమే

"బాబాయ్‌గారూ! మీరేం చెప్తున్నారో నాకర్థం కావడం లేదు అసలేం జరిగిందో వివరంగా చెప్పండి " ఆత్రంగా అడిగింది సుకన్య!

'మీనాన్న, నేను ప్రతిరోజూ సాయంత్రం వేళ బీచ్‌కి వెళ్తుండేవాళ్ళం. ఇద్దరం ఆ సముద్రపు ఒడ్డున కూర్చుని గంటలు గంటలు గడిపే వాళ్ళం."

"మీ అన్నయ్యలు వాడిని నిర్లక్ష్యంగా చూస్తున్నారని, తన పొడ అంటే గిట్టడం లేదని, నాతో చెప్పుకొని, తనలో బాధ కొంత తగ్గించుకునే వాడు'

'ఆరోజు అలాగే మీ పెద్దన్నయ్య దగ్గరకి వెళ్ళి వచ్చానని, పెద్ద కొడుకు తనని కన్న తండ్రిగా కాక పోయినా, సాటి మనిషిగానన్నా గౌరవించలేదని, పైగా తనని అక్కడ నుండి వెళ్ళిపొమ్మన్నట్టు ట్రైన్ టికెట్ కొని మరీ ఇచ్చాడని, నాతో చెప్పి బాధపడ్డాడు'


"ఒరేయ్! విష్ణూ! సెలవులని పెద్ద కొడుకు దగ్గరకి వెళ్ళావు. నాలుగు రోజులు సరదాగా కాలక్షేపం చేసి వచ్చేసావు ఐనా నీకిప్పుడేం తక్కువ మరో ఐదారేళ్ళ వరకు నీకు సర్వీసు వుంది పైగా నలుగురి పిల్లలకి ట్యూషన్స్ చెప్తున్నావు. నువ్వు సంపాదించిన దాంట్లో, కాస్త వెనకేసు కున్నావంటే చాలు, నిన్ను వాళ్ళు నెత్తిమీద పెట్టుకుంటారు. నీ తర్వాత ఆస్తి ఏ కొడుకుకు వ్రాస్తావో అని, వాళ్ళిద్దరూ నిన్ను ఆప్యాయంగా చూసుకుంటారు" అన్నాను నేను


"అంటే! వాళ్ళు అభిమానించేది నన్నుకాదు నాడబ్బునన్నమాట" అన్నాడు పేలవంగా నవ్వుతూ!

"విష్ణూ! బాధపడకురా! ఇది నీ ఒక్కడికి ఎదురైన సమస్య కాదు నీకన్నా అధ్వాన్నమైన పరిస్థితిలో మరెంతమంది ఉన్నారో ఒకేసారి ఊహించు"

అదికాదురా నాబాధ! నేను రిటైరు అయిపోయాక,






ఏ కొడుకు దగ్గరకో, ఒక కొడుకు దగ్గరకు, వెళ్ళిపోయి, మనవలతో చీకూ చింతా లేకుండా కాలక్షేపం చెయ్యాలనుకున్నాను కట్టుకున్న భార్య ఏనాడో కాలం చేసింది. వాళ్ళ ముగ్గురిని తల్లి, తండ్రి, నేనే అయిపెంచాను. ప్చ్! ఏమిటో! ఒక్కడికీ నామీద అభిమానం లేదు. నిట్టూరుస్తూ అన్నాడు.

ఇంతలో ఒక అమ్మాయి సముద్రం వైపుకి వెళ్తోంది. ఆ అమ్మాయి సరదాకి వెళ్తుంది అనుకొని కాస్సేపు ఊరుకున్నాం పెద్ద, పెద్ద అలలు మీదకి వస్తున్నా, ఆ అమ్మాయి కదలకుండా నిశ్చలంగా నిలబడింది

బీచ్‌లో ఎవరి హడావుడిలో వాళ్ళున్నారు అప్పటికే కాస్త చీకటి పడడంతో, ఎవ్వరూ ఆమెను గమనించలేదు

ఆమె ఇంకా ముందుకి వెళ్తోంది. ఇంతలో మరొక పెద్ద కెరటం వచ్చి, ఆమెను పూర్తిగా తడిపేసింది

ఆమె వ్యవహారం, ఏదో అనుమానాన్ని కలిగించిందేమో, విష్ణు గబగబా, అటు పరిగెత్తి, ఆమెను ఒడిసిపట్టుకున్నాడు

"వదలండి నన్ను వదలండి నేను. నేను చచ్చిపోవాలి " అందామె పెనుగులాడుతూ!

"విష్ణు ఆమె మాట వినిపించుకోకుండా బలవంతంగా ఆమెను ఒడ్డుకి తీసుకు వచ్చాడు

ఆ అమ్మాయి ఇసుకలో కూలబడి సన్నగా ఏడుస్తోంది

"ప్లీజ్! ఏడవకండి. మీ ఇల్లు ఎక్కడో చెప్తే, మిమ్మల్ని అక్కడికి తీసుకు వెళ్తాను." అన్నాడు విష్ణు!

'వద్దు. నాకెవరూ లేరు నన్ను చచ్చిపోనివ్వండి మీకు దణ్ణం పెడతాను " వెక్కిళ్ళ మధ్య అందా అమ్మాయి

"అంటే! ఇప్పుడు మిమ్మల్ని మేము వదిలేస్తే, మీరు నిశ్చింతగా సముద్రంలోకి వెళ్ళిపోయి ప్రాణాలు తీసుకుంటారన్నమాట! మీ చావు మేము కళ్ళారా చూస్తూ ఊరుకోవాలన్న మాట!" తీక్షణంగా అన్నాడు విష్ణు!

ఆమె ఏమీ జవాబు చెప్పకుండా ముడుకుల్లో

# తోడు

తలదాచుకొని ఏడుస్తోంది.

"మీకభ్యంతరం లేకపోతే, మీ కొచ్చిన కష్టమేమిటో చెప్పండి. నాకు సాధ్యమైతే, మీ బాధ తీరుస్తాను" అన్నాడు విష్ణు

"ఇది ఒకళ్ళు తీర్చవలసిన బాధకాదు నేను చేసిన పాపానికి నన్నే బలికానివ్వండి. కన్న తల్లి దండ్రులకి దూరమై, ప్రేమించిన వాడితో వెళ్ళి పోయినందుకు, నాకు తగిన శాస్తే జరిగింది అతని తియ్యని మాటలకు మోసపోయి, నా శీలాన్ని అతడికి కానుకగా అర్పించాను నాతో అవసరం తీరగానే అతడు నన్ను గాలికి వదిలేసి వెళ్ళిపోయాడు. ఇటు తల్లి, దండ్రులకి ముఖం చూపించలేను అటు ప్రేమించిన వాడికి దూరం అయ్యాను ఇక ఈ లోకంలో ఎలా బ్రతక మంటారు? మీరే చెప్పండి." దుఃఖోద్వేగంతో ఆమె పెదవులు అదురుతున్నాయి.

"మీకభ్యంతరం లేకపోతే, నా ఇంట్లో మీకు ఆశ్రయం కల్పిస్తాను" అన్నాడు విష్ణు

"విష్ణూ! నువ్వేం చేస్తున్నావో తెలుసా!" అన్నాను ఆశ్చర్యంగా!

'ఔనురా! తెలిసే చేస్తున్నాను ఈ అమ్మాయికి నా ఇంట్లో ఆశ్రయం కల్పించి నంత మాత్రాన నాకు వచ్చేనష్టమేమీ లేదు" అన్నాడు దృఢ స్వరంతో!

ఆ అమ్మాయి ఆశ్చర్యంగా విష్ణువైపు చూసింది.

"పదండి ఇప్పటికే చాలా చీకటి పడింది" అని లేచాడు విష్ణు

"అలా విష్ణు ఆ అమ్మాయిని, తన ఇంటికి తీసుకు వెళ్ళాడు. ఆత్మహత్య చేసుకోబోయిన, ఆ అమ్మాయిని రక్షించి, తన ఇంట్లో పెట్టుకున్నందుకు, విష్ణు మీద లోకం పెద్ద అభాండం వేసింది. విష్ణు ఎవరో ఒక అమ్మాయిని ఉంచుకున్నాడని, చాటు, మాటుగా చెవులు కొరుక్కునే వారు "

ఈ విషయం విన్న లక్ష్మి మళ్ళీ ఆ ఇంటి నుండి వెళ్ళిపోవాలని ప్రయత్నం చేసింది కానీ విష్ణు ఆ అమ్మాయిని అడ్డుకొని, తన ఒంటరి బ్రతుక్కి జీవితాంతం తోడుగా నిలవమని, అర్థించడంతో, ఆ అమ్మాయి మౌనం దాల్చింది.

ఆ తర్వాత వెంకటేశ్వరుడి గుడిలో వాళ్ళిద్దరికి పెళ్ళి నేనే జరిపించాను.

చెప్పడం ఆపి దీర్ఘంగా నిట్టూర్చాడు రంగనాథం

"మరి.. లక్ష్మి.... అదే.... ఆమె గర్భవతి. అనివిన్నాను. అదీ నిజమేనా?" అంది సుకన్య తడబాటుగా!

"అక్షరాలా నిజం. విష్ణు ఆమెను పెళ్ళి చేసుకున్నాడే తప్ప, ఆమెను ఏనాడూ ఆదృష్టితో చూడలేదు నీ చిన్నప్పుడే మీ నాన్న వాసక్టమీ చేయించుకున్నాడు."

"బాబాయ్‌గారూ! మీరు చెప్పేది నిజమా!" అంది సుకన్య ఆశ్చర్యంగా!

"ఔను! సుకన్యా! ఆ అమ్మాయి వాడికి పరిచయం అయ్యే నాటికే నెల తప్పిందట! నీకు తెలిసింది, నువ్వు అర్థం చేసుకున్నది వాడు మళ్ళీ పెళ్ళి చేసుకున్నాడన్న ఒక్క నిజాన్నే! కానీ ఆ నిజం వెనుక ఇంత కథ ఉందని నీకు తెలియదు ఈ విషయాన్ని తనకు తానుగా నీతో చెప్పుకోలేదు నువ్వు వాడు మళ్ళీ పెళ్ళి చేసుకున్నాడని ద్వేషాన్ని పెంచుకొని ఉంటావు కానీ వాడు కోరుకున్నది ఒక్క తోడు మాత్రమే! తన అంతిమ కాలంలో, నిశ్చింతగా ప్రాణాలు వదిలెయ్యాలన్న ఆరాటంతోనే బ్రతుకు చెడిన ఆ అమ్మాయి మెడలో పసుపుత్రాడు కట్టాడు తన తోడు తానే వెతుక్కునే స్వార్థపరుడు కాదమ్మా మీ నాన్న! తన అనంతరం, ఉన్న కొద్ది పాటి ఆస్తి ఆ అమ్మాయి పేరనే విల్లు వ్రాసాడు ఆ అమ్మాయికి భవిష్యత్తు బంగారు బాట చేసే ప్రయత్నంలోనే ఉన్నాడు" అన్నాడు రంగనాథం

"బాబాయ్‌గారూ! నేను నిజంగా నాన్నని అపార్థం చేసుకున్నాను. కన్నకొడుకులు లాగే, నేను నాన్నని దూషించాను " అంది పశ్చాత్తాపం నిండిన స్వరంతో!

"సుకన్యా! ఇప్పటికైనా మీ నాన్న దగ్గరకి వెళ్తావా!" అన్నాడు రంగనాథం

"తప్పకుండా వెళ్తాను బాబాయ్ గారూ! నాన్న చేసిన పనికి నేను గర్విస్తున్నాను." అంది సుకన్య లేచి నిలబడుతూ! □